సాక్షి
హనుమకొండ
శనివారం । 25 । మార్చి । 2023



గజ్జల గ్రంథాలయం.. ప్రకృతి పరవశం

ప్రకృతి వైద్య ప్రేమికుడు రామేశ్వరానికి కీర్తి పురస్కారం లభించింది. నేచురోపతి లైబ్రరీ.. ఎంతోమందికి విజ్ఞానాన్ని పంచుతోంది.

-8లో▸



అవినీతి నుంచి అభివృద్ధిలోకి..

వరంగల్ డీసీసీబీలో అవినీతిని ఎండగట్టి అభివృద్ధిలోకి తీసుకువచ్చామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

-10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0⁰ /25.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాక్షికంగా ఎండగా ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని	ఆది
6:34	4:54

న్యూస్‌రీల్

టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి



విద్యారణ్యపురి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దామెర భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పట్టాలన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ కందగట్ల సురేష్, బాధ్యులు ఈదునూరి మధుసూదన్‌రెడ్డి, కె.జయపాల్ రెడ్డి, పల్లకొండ వీరస్వామి, దుగ్యాల సరస్వతిదేవీ, శ్రీనివాస్‌రావు గుంషావళి, వెంకటేశ్వర్లు, లక్‌పతి పాల్గొన్నారు.

జీఎంహెచ్‌లో ప్రతిరోజూ టీకా సేవలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి (జీఎంహెచ్)ఆవరణలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రంలో ఇకనుంచి ప్రతి రోజూ (ఆదివారం మినహా) పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కేంద్రంలో ప్రత్యేక టీకా వైద్యసేవలను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారందరూ షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాలక్ష్మీ, జీఎంహెచ్‌ఓ ఆర్ఎంఓ డాక్టర్ సారంగం, డాక్టర్లు ప్రశాంత్, మానస, తేజస్విని, ప్రేమలత పాల్గొన్నారు.

డీవైఎస్‌ఓ అశోక్‌కు పదోన్నతి



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్‌కు గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 రెజ్లింగ్ కోచ్‌గా పదోన్నతి కల్పిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ, ఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అశోక్‌కుమార్.. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆమె కార్యాలయంలో కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అశోక్ కుమార్‌ను కలెక్టర్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల కళాశాలలోని విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎంసెట్, నీట్ ఎంట్రన్స్ షార్ట్ టర్మ్ సమ్మర్ క్యాంపును అందజేయనున్నట్లు గురుకుల, కళాశాలల రీజినల్ కో–ఆర్డినేటర్ రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ క్యాంపు బోధనకు టెంపరరీ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, కరుణాపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర జూనియర్ కళాశాలలో ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79890 78492 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

478మంది గైర్హాజరు

విద్యారణ్యపురి/కాశీబుగ్గ/కాళోజీసెంటర్ : ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో శుక్రవారం హనుమకొండ జిల్లాలో 288మంది, వరంగల్ జిల్లాలో 190మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓలు గోపాల్, మాధవరావు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 13,694మందికిగాను 13,406మంది విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్ జిల్లాలో 5,008 మంది హాజరుకావాల్సి ఉండగా.. 4,818 మంది పరీక్ష రాశారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి - 10లో▸

15మంది విక్రేతలు.. 150మంది స్మోకర్లు

వరంగల్ నగరంలో గం'జాయ్'

- అధికారికంగా గుర్తించిన పోలీసులు
- 'మత్తు'లో చిత్తవుతున్నది విద్యార్థులు, యువతే.
- 'కమిషనరేట్' పరిధిలో ఇక స్పెషల్ డ్రైవ్.. రంగంలోకి టాస్క్‌ఫోర్స్?



20న వైజాగ్ నుంచి వరంగల్‌కు తీసుకొచ్చిన గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ నగరంలో 15మంది విక్రేతలు.. 150మంది రెగ్యులర్ స్మోకర్లు.. ఈ గణాంకాలు సిగరెట్లు తాగేవారివి కాదు.. మత్తు పదార్థమైన గంజాయి అమ్మే, తాగే వారి లెక్కలు. వీరిని వరంగల్ పోలీసులు అధికారికంగా గుర్తించారు. వీరిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా నగరంలో గంజాయి రవాణా ఆగడం లేదు. ఈ క్రమంలో ఈసారి వారి భరతం పట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ దందాలో వెనకుండి నడిపించేవారు చాకచక్యంగా బయటపడుతుండడంతో ఎన్నిసార్లు, ఎంత మందిని అరెస్టు చేసినా.. గంజాయి రవాణా ఆగడం లేదన్న వాదన వినిపిస్తోంది.

గంజాయి చేరుతుందిలా..

హైదరాబాద్ తర్వాత మత్తుపదార్థాల మాఫియా వరంగల్‌ను అడ్డాగా మార్చుకుంది. ఏపీనుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి వరంగల్ నగరంలో పలు అడ్డాలకు రవాణా అవుతోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొంతమంది ఈ అడ్డదారిని ఎంచుకుని స్మగ్లర్లుగా మారుతున్నారు. హసన్‌పర్తి, గీసుకొండ, మామునూరుతో పాటు గ్రేటర్ వరంగల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఈ దందాను కొనసాగిస్తున్నారు. స్థానిక వ్యాపారులకు తోడు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వారు జతకట్టడంతో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం గీసుకొండ మండలానికి చెందిన సుమన్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో ఈ సమాచారం బయటపడింది.

యువత లక్ష్యంగా గంజాయి 'దమ్ము'..

నగరం ఎడ్యుకేషనల్ హబ్‌గా ఉండడం వల్ల విద్యార్థులు, యువత టార్గెట్‌గా గంజాయి మాఫియా విక్రయాలు జరుపుతోంది. ప్రధానంగా వరంగల్ ప్రాంతంలో ఉర్సుగుట్ట, ఎస్ఆర్ఆర్ తోట, పెరుకవాడ, శాంతినగర్, లేబర్ కాలనీలోని ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో, బొల్లికుంట, నగర శివారు ప్రాంతాలైన బొల్లికుంటనుంచి వర్ధన్నపేట మార్గంలో, ఆరెపల్లి, ఆటోనగర్ కాలువ, హనుమకొండ ప్రాంతంలో దర్గా రోడ్, పబ్లిక్ గార్డెన్, యూనివర్సిటీ ప్రాంతం, ఎన్ఐటీ ఏరియా, డీజిల్ కాలనీ ఏరియా, హంటర్ రోడ్‌లలో ఎక్కువగా యువత అడ్డాలుగా చేసుకుని తాగుతున్నారని సమాచారం. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ కాలనీ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో ఖాళీ క్వార్టర్లు ఉండడంతో వాటిని యువత అడ్డాగా చేసుకున్నట్లు తెలిసింది. బాటిల్ షాట్, పేపర్ షాట్, డైరెక్ట్ షాట్‌ల పేరిట 'కోడ్ లాంగ్వేజ్' ఉపయోగిస్తున్నారు. కాగా పకడ్బందీగా గంజాయి విక్రయాలను అరికట్టడంపై కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టి సారించారు. ఇప్పటికే 15 మంది విక్రేతలు, రెగ్యులర్‌గా గంజాయి తాగే 150 మందిని గుర్తించారు. సీపీ ఆదేశాల మేరకు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా రెండు రోజులుగా గంజాయి రవాణా, విక్రయాలు, ఈ దందా వెనుక ఉన్న కీలక వ్యక్తుల గురించి ఆరా తీస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కొన్ని ఘటనలు

- ఈ నెల 3న కాజీపేట రైల్వేజంక్షన్‌లో ఐదుగురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారినుంచి సుమారు రూ.10 లక్షల విలువ చేసే 134 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 4న వరంగల్ నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తుండగా సుమారు 400 కిలోల గంజాయిని రాచకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రవాణా చేస్తున్నది హనుమకొండవాసులే.
- ఈ నెల 20న రూ.60 వేల విలువగల 3 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకుని నలుగురిని కోర్టుకు రిమాండ్ చేశారు.
- ఒక్క నెలలో వివిధ పోలీస్‌స్టేషన్లలో 06 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.

గంజాయి దందాపై ఉక్కుపాదం



వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను గంజాయి రహిత కమిషనరేట్‌గా చేయడమే లక్ష్యం. ఇందుకోసం గంజాయి సంబంధిత ఉత్పత్తులు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం. రవాణాపై సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలి. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి. విపరీత ధోరణి, వారి ప్రవర్తన గమనించి మాదక ద్రవ్యాలు వినియోగించినట్లయితే పోలీస్ వారికి తెలియజేయాలి.

\- ఏవీ రంగనాథ్, పోలీసు కమిషనర్, వరంగల్

సాక్షి 15వ వార్షికోత్సవం



సాక్షి దినపత్రిక పురుడు పోసుకుని 15ఏళ్లు పూర్తయిన సందర్భంగా వరంగల్ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, రిపోర్టర్లు, సిబ్బంది కలిసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సాక్షిలో తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

నాది ఎమ్మెల్యేకంటే పెద్ద పదవి..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి



అవార్డులు ప్రదానం చేసి అభినందిస్తున్న కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: 'నాది ఎమ్మెల్యే కంటే పెద్ద పదవి అని, అయినా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్‌లోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన జాతీయ పంచాయతీ అవార్డులు–2023 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి అవార్డులు అందజేసి సన్మానించారు. 'సీఎం కేసీఆర్ నన్ను ఎమ్మెల్సీని చేసి విప్ చేశారు. దీనికంటే ఎమ్మెల్యే పదవి చిన్నదైనా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న కోరికతోనే పోటీ చేస్తానని తెలిపారు. ఇతర నియోజకవర్గాలు అభివృద్ధిలో ఉరకలేస్తుంటే ఏడున్నరేళ్లుగా మంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. 2014కు ముందు రోడ్లకు రూ.50 వేలు, రూ.లక్ష ఇచ్చేవారని, కేసీఆర్ సీఎం అయ్యాక రూ.20 నుంచి రూ.50 లక్షల దాక నిధులు మంజూరు చేసుకుంటున్నామని, ఇదంతా కేసీఆర్ గొప్పతనం అన్నారు. అనంతరం ఇంటింటికి కౌశిక్ అన్న పేరిట పలు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ జగదీశ్వర్, ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పీటీసీ లాండిగె కల్యాణిలక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచులు, పెండ్యాల రవీందర్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, సర్పంచ్ కట్కూరి విజయతిరుపతిరెడ్డి, ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమల పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు ఊరట

డీసీసీబీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి



కాజీపేటలో భారీ ర్యాలీ తీస్తున్న రాఘవరెడ్డి

కాజీపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్, జనగామ కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో ఇంటింటికి కాంగ్రెస్ పేరుతో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు సోమిడి బొడ్రాయి, విష్ణుపురిలో శ్వేతార్కమూలగణపతి ఆలయాన్ని దర్శించుకున్నారు.

రాహుల్‌గాంధీపై వేధింపులు ఆపాలని ఆందోళన

ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ కాజీపేట చౌరస్తాలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి రాఘవరెడ్డి ఆందోళన నిర్వహించారు. హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ, నాయకులు కట్ల శ్రీనివాస్, సయ్యద్ రజాలీ, జక్కుల రమ, బోయిని కుమార్ యాదవ్, గుర్రం కోటేశ్వర్, కట్కూరి రమేస్, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కూర్ల మోహన్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి : కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఎంజీఎం: ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి.. వ్యాధి నివారణకు కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలస్వామిగుడి నుంచి ఎంజీఎం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఉద్యోగులకు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, టీబీ ప్రోగ్రాం జిల్లా అధికారి సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ పాలకమండలి సమావేశం

- అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక ఆమోదించే అవకాశం
- కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై కూడా చర్చ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2023–2024 అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక, అకాడమిక్ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలను చర్చించి అమోదించనున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉదయం 11గంటలకు ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహిస్తారు. యూనివర్సిటీ ఆదాయ, వ్యయాలను చర్చించనున్నారు. బడ్జెట్‌పై ఫైనాన్స్ ఆమోదం తరువాత మధ్యాహ్నం 2గంటలకు పాలకమండలిలో రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కేయూ వీసీ తాటికొండ రమేష్, ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొని చర్చించి ఆమోదించనున్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ అకాడమిక్‌కు సంబంధించిన అంశాలు, స్టాండింగ్ కమిటీలో నిర్ణయించి ఆమోదించిన వాటిపై కూడా మరోమారు చర్చించి ఆమోదించనున్నారు. పలువురు ప్రొఫెసర్లను పరిపాలనా పదవుల్లో ఇప్పటికే నియమించారు. వీరి నియామకాలను ర్యాటిఫికేషన్ చేస్తారు.

శ్రీనివాస్‌రావుకు ఉత్తమ అవార్డు ఎంపికపై చర్చ

దూర విద్యకేంద్రంలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావును గత విద్యాసంవత్సరంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపిక చేశారు. ప్రభుత్వంనుంచి అవార్డు కూడా అందుకున్నారు. దీనిపై విమర్శలు వచ్చాయి. హిస్టరీ విభాగం ప్రొఫెసర్ టి.మనోహర్ తనకు రావాల్సిన అవార్డును శ్రీనివాస్‌రావును ఎలా ఇస్తారని కొంత కాలం క్రితం యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈ అవార్డు ఎంపికపై కూడా పాలకమండలి సమావేశంలో చర్చించనున్నారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై కూడా ..

కాకతీయ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల కోడిఫైడ్ సర్వీస్‌రూల్స్‌పై గతంలో రాష్ట్ర ఉన్నత విద్యాకమిషనర్ నవీన్ మిట్టల్, పాలకమండలి సభ్యులు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ చంద్రమౌళితో కూడిన సబ్ కమిటీ వేశారు. ఆ కమిటీ కూడా నివేదికను సమర్పించింది. దీనిపై చర్చించి ఆ సర్వీస్‌రూల్స్‌ను ఆమోదించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు నాన్‌టీచింగ్ ఉద్యోగుల నియామకాలు, పదోన్నతుల విషయంలో కేయూకు ప్రత్యేకంగా సర్వీస్ రూల్స్ లేకపోవడంతో యూనివర్సిటీ సర్వీస్‌రూల్స్‌తోపాటు ఇతర యూనివర్సిటీలో అనుసరించే విధానాలను పాటించడంతో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పలు రకాల పదోన్నతులు నిలిచిపోయాయి. 2016నుంచి వివిధ ఉద్యోగ సంఘాలు యూనివర్సిటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా కోడిఫైడ్ సర్వీస్ రూల్స్ కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ రూల్స్‌ను ఆమోదిస్తే ఇక కేయూకు ప్రత్యేకంగా సర్వీస్ రూల్స్ అమలు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

కేసీఆర్ హయాంలోనే గ్రామాల్లో సుపరిపాలన

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల మండల సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయ ఆవరణలో శుక్రవారం జాతీయ పురస్కారాలు–2023 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 74 గ్రామ పంచాయతీలకు వివిధ అంశాలలో వచ్చిన 164 బహుమతులను సర్పంచ్‌లు, కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపు, పల్లె ప్రజల ఆరోగ్యం, పిల్లలు, మహిళలకు స్నేహపూర్వక వాతావరణం, సమృద్ధిగా నీరు, స్వయం సమృద్ధి, మౌలిక వసతులు, సామాజిక బాధ్యత, సుపరిపాలన వంటి 9 అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం వల్ల వల్ల నేడు దేశంలోనే అధిక ఉత్తమ గ్రామపంచాయతీలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. అదేవిధంగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సంపత్‌రావు, వరంగల్ డీపీఓ కల్పన, హనుమకొండ డీఎల్‌పీఓ జగదీశ్వర్‌తోపాటు పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ, గీసుకొండ, సంగెం మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలి

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ చౌరస్తా: ఆదాయ పన్ను, టీడీఎస్, జీఎస్‌టీలపై వ్యాపారులు అవగాహన కలిగి ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హంటర్ రోడ్డు సాయినగర్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా వరంగల్ ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఆదాయ పన్నుపై జరిగిన అవగాహన సదస్సును ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బ్రాంచ్ ద్వారా విద్యార్థులు, గుమస్తాలకు శిక్షణ ఇవ్వడం వల్ల అకౌంట్స్‌లో నైపుణ్యాలు పెంపొందుతున్నాయన్నారు. రిటైర్డ్ ఆదాయపన్ను శాఖ కమిషనర్ సీహెచ్.ఓంకారేశ్వర్.. వ్యాపారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన, ముఖ్యులు అరవింద, వేద ప్రకాష్,ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ గోపీచంద్, వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ, వైస్ చైర్మన్ భగవాన్ దాస్ ముందడా, వరంగల్ సికాస చైర్మన్ సుజిత్, కోశాధికారి రామకృష్ణ, పాస్ట్ చైర్మన్ ప్రదీప్ చందర్, కార్యదర్శి సత్యనారాయణ పూజారి పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీయాలి

ఎఫ్ఎల్ఎన్ స్టేట్ మానిటరింగ్ టీం సభ్యుడు రామయ్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్టేట్ మానిటరింగ్ టీం సభ్యులు

కమలాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, సామర్థ్యాలను వెలికితీయాలని ఎఫ్ఎల్ఎన్ స్టేట్ మానిటరింగ్ టీం సభ్యుడు, గణిత పాఠ్య పుస్తక రచయిత కందాల రామయ్య సూచించారు. కమలాపూర్ మండలంలోని గూడూరు, శనిగరం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కమలాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన టీం సభ్యులతో కలిసి పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించి పరీక్షల్లో గ్రాఫ్ ఏ విధంగా ఉపయోగించాలి, మోడల్ ఆన్సర్ షీట్‌ను విద్యార్థి స్వయంగా తయారు చేసుకునే విధంగా అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మండల విద్యాధికారి ఇ.రాంకిషన్‌రాజు కమలాపూర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల, టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ బాలికలు, కేజీబీవీ, ఎంజేపీ బాలుర, బాలికలు, ఉప్పల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్ రికార్డులు, పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకుడు సీహెచ్.రాములు, డీఆర్పీ పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నాగేంద్రబాబు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కూచిపూడి గురువు పద్మజ కన్నుమూత

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నృత్యకారులు

- వివరాలు 8లో▸

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు జమ చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. మూడు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని వాపోయారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యులు టి.లింగారెడ్డి, రాష్ట్ర బాధ్యులు కె.సోమశేఖర్, నన్నబోయిన తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతినెలా 15వ తేదీ వరకు వేతనాల కోసం వేచి చూడాల్సి వస్తుందన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవులు, వేతనాల సప్లిమెంటరీ బిల్లులు, జీపీఎఫ్ డబ్బులు, పెన్షన్ బిల్లులు, గ్రాట్యూటీ చెల్లింపులు ఏడు నెలలుగా ట్రెజరీలనుంచి విడుదల కావడం లేదన్నారు. ఈ నెల 31వ తేదీలోపు పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు కడారి భోగేశ్వర్, రావుల రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, ఎం.రఘుపతి, కె.శ్రీనివాస్, గోవిందరావు, టి.సుదర్శనం, తాటికాయల కుమార్, జి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బద్దం వెంకటరెడ్డి, యాకయ్య, సీహెచ్.రవీందర్‌రాజు, డి కిరణ్‌కుమార్, మనోజ్‌గౌడ్, సుభాషిణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రకాళి మాతకు కనకాంబరాలతో పుష్పార్చన



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో వసంతనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం కనకంబరాలతో లక్షపుష్పార్చన నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు అధ్వర్యంలో అమ్మవారికి వివిధ పూజలు జరిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సీతారాములకు తులసీదళార్చన

వేయిస్తంభాల దేవాలయంలో శ్రీసీతారామ చంద్రస్వామి వారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తులసీదళార్చన నిర్వహించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో యాగశాలలో మహా సుదర్శ నహోమం నిర్వహించారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న జరగనున్నాయి. శుక్రవారం అంబేద్కర్ హాల్‌లో మధ్యాహ్నం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గడువు ముగిసింది. శనివారం అభ్యర్థుల ఉప సంహరణ కార్యక్రమం ముగియడంతో సాయంత్రం పోటీల్లో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. ఏకగ్రీవంగా కిరణ్‌సింగ్, విష్ణుకుమార్‌గుప్తా, పద్మలత గౌడ్ నియమితులు కాగా.. నామినేషన్ వేసిన వారిలో ప్రెసిడెంట్‌గా యం.రమేశ్‌బాబు, పి.సత్యనారాయణ, వై.శ్యాం సుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా డి.దయాన శ్రీనివాసన్, ఎస్.నరేందర్, ఎస్.రాజన్‌బాబు, ఆర్.వెంకటేశ్వర్‌రావు, ఆర్.వెంకటనారాయణ, జనరల్ సెక్రటరీగా జి.శివప్రసాద్, జి.శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా కె.రమేశ్, సీహెచ్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ స్పోర్ట్స్, కల్చరల్‌గా పి.చిరంజీవి, ఎం.శ్రీనివాస్, ఎం.విజేందర్, కోశాధికారిగా వి.అందాలు, జి.సదానందం, కార్యవర్గ సభ్యులుగా అనిల్, ప్రదీప్, రమేశ్, శరత్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, అనిల్‌కుమార్, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు రాజని, రమాదేవి, సంధ్యరాణి, ఎస్‌కే. షన్నాకుమారి, ఉషా ఉన్నారు.

'గజ్జల' గ్రంథాలయం.. ప్రకృతి పరవశం!



రామేశ్వరం ఏర్పాటు చేసిన నేచురోపతి లైబ్రరీ

- అరుదైన పుస్తకాలు సేకరించి నేచురోపతి లైబ్రరీ ఏర్పాటు
- ప్రజా బాహుళ్యంలోకి ప్రకృతి వైద్య విజ్ఞాన సంపద
- పుస్తకాల ప్రదర్శనలు, పరిశోధనలు
- 29న రిటైర్డ్ ఆచార్యులు 'గజ్జల'కు కీర్తి పురస్కారం

విశ్వానికి సంబంధించిన అనంతమైన నిధి అక్కడ దాగుంది. ప్రకృతి అక్షరాల రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆధునిక వైద్యానికి సైతం అందని ఎన్నో రుగ్మతలకు పరిష్కారం అక్కడ దొరుకుతుంది. ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్ల శ్రమించి నిర్మించిన కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం కృషిపై 'సాక్షి' ప్రత్యేకం.

\- కేయూ క్యాంపస్

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యులు గజ్జల రామేశ్వరం. ఆయన అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను సేకరించారు. మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్యంపై ఉన్న మక్కువతో దేశమంతా తిరిగి అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాలు, జర్నల్స్‌ను సేకరించారు. ప్రకృతి వైద్య సాహిత్య ప్రదర్శనలిచ్చి ప్రజా బాహుళ్యంలోకి వెళ్లేలా కృషి చేశారు. హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని బ్యాంకుకాలనీలో తన సొంత భవనంలో జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య గ్రంథాలయాన్ని 2018 జులై 24న ఏర్పాటు చేశారు. ఆతర్వాత దాన్ని 2021 జులై 24న అంతర్జాతీయ ప్రకృతి వైద్య విజ్ఞాన సంపదతో అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీగా మార్చారు. గ్రంథాలయంలో ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ, మరాఠీ, ఉర్దూ, గుజరాతి కన్నడ తదితర భాషల్లో ఆయా ప్రకృతి వైద్య సాహిత్యం అందుబాటులో ఉంది. ఎవరైనా ఇక్కడికి వచ్చి అందులోని ప్రకృతి వైద్య సాహిత్యాన్ని, జర్నల్స్‌ను చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఉచిత ప్రవేశం, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అక్కడే రెండ్రోజులు ఉండేలా వసతి కూడా కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠకులు వచ్చి చదువుకోవచ్చు. సుమారు వందేళ్ల కిందటి నేచురోపతికి సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్, మాసపత్రికలు ఇక్కడి లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.



బీఈడీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

సదస్సులు.. రికార్డులు..

అరుదైన ప్రకృతి వైద్య సాహిత్యం సేకరించిన ఆచార్య రామేశ్వరంనకు 2016లో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 1990లో ముంబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో రామేశ్వరం పాల్గొని పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తెలుగులో ప్రకృతి వైద్య నిఘంటువు ఆయన రూపొందించారు. ప్రకృతి వైద్య విజ్ఞాన గ్రంథాల వివరాలను బిబ్లియోగ్రఫీ పుస్తకం రూపంలో తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే మహాత్మాగాంధీ అండ్ నేచురోపతి 50 సంవత్సరాల గవర్నమెంట్ అండ్ పాలిసీస్ అండ్ ప్రోగ్రామ్స్ అంశంపై న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో రామేశ్వరం సమర్పించిన పరిశోధన పత్రానికిగాను సంబంధిత అధికారుల చేతుల మీదుగా బ్రాంజ్‌మెడల్‌ను అందుకున్నారు. గతేడాది డిసెంబర్ 25న హైదరాబాద్‌లో నిర్వహించిన వాజ్‌పేయి జయంతిలో గజ్జల రామేశ్వరంనకు వాజ్‌పేయ్ ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారం అందజేశారు.

మ్యూజియంలో పుస్తకాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ హెరిటేజ్ మ్యూజియంలో రామేశ్వరం సేకరించిన అరుదైన పలు పుస్తకాలను కూడా అందులో ఉంచాలని ఆసంస్థ కోరి కొంత స్థలాన్ని కేటాయించడంతో ఆయన అక్కడి మ్యూజియంలో కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

కీర్తి పురస్కారం

వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరంను ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ప్రకటించారు. ప్రకృతి వైద్య సాహిత్య సేకరణ, లైబ్రరీ ఏర్పాటు, ప్రకృతి వైద్యంలో పరిశోధనలకు గాను ఆ యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందించనుంది. ఈనెల 29న రామేశ్వరం ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

విశ్వవ్యాప్తం చేయాలనే తపన



మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్య విధానాన్ని ప్రజా బాహుళ్యంలోకి విశ్వవ్యాప్తం చేయాలనేది నా తపన. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సేకరించిన అరుదైన పుస్తకాలు, జర్నల్స్‌తో లైబ్రరీని ఏర్పాటు చేశాను. కీర్తి పురస్కారం లభించడం సంతోషంగా ఉంది. గ్రంథాలయం ప్రకృతి వైద్య పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందరూ వినియోగించుకోవాలి.

\- గజ్జల రామేశ్వరం, రిటైర్డ్ ఆచార్యులు

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- మృతురాలు నాలుగు నెలల గర్భవతి



మృతి చెందిన సాయిప్రత్యూష

మరిపెడ రూరల్: అత్తింటి కట్నం వేధింపులకు ఓ వివాహిత బలైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మతండా గ్రామ పంచాయతీ పరిధి జామ్లా తండాకు చెందిన సాయి ప్రత్యూష(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జామ్లా తండాకు చెందిన బానోతు మహేశ్‌కు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన సాయిప్రత్యూష ప్రేమించి మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో కట్న కానుకల కింద బంగారం, సుమారు రూ.లక్ష ఇచ్చారు. వీరికి 18 నెలల పాప ఉంది. మహేశ్ వ్యవసాయ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలి కాలంలో అదనపు కట్నం కోసం భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు తండా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ గొడవలు సర్దుమణగలేదు. దీంతో భర్తతో పాటు అత్త, మామ వేధింపులు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో మరోసారి ఇంట్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గురువారం రాత్రి సాయి ప్రత్యూష ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రస్తుతం సాయిప్రత్యూష నాలుగు నెలల గర్భవతిగా అక్కడి వైద్యులు గుర్తించినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి దరావత్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామ రూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేల మందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని, రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు, వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, వివిధ జిల్లాల నుంచి అధికారులు, రైతులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భాగ్య, అధికారులు

కూచిపూడి గురువు పద్మజ కన్నుమూత



కుప్పా పద్మజ (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కుప్పా పద్మజ (56) గుండెపోటుతో ఓ సిటీలోని ఆమె స్వగృహంలో గురువారం రాత్రి కన్నుమూశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పద్మజ గురువారం సాయంత్రం 7 గంటల వరకు విధుల్లో ఉన్నారు. ఆమె మరణ వార్త వినగానే సంగీత కళాశాల సిబ్బంది, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సంగీత, నృత్యకళాకారులు, శిష్యబృందం, గురువులు, ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. పద్మజ ఐదేళ్ల వయస్సు నుంచి నాట్యం నేర్చుకున్నారు. వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం నిర్వాహకురాలు వెంపటి నాగేశ్వరి వద్ద నృత్యం నేర్చుకున్నారు. 1992లో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా చేరారు. 2014 నుంచి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. న్యూఢిల్లీ దూరదర్శన్ కేంద్రం నుండి 'ఏ' గ్రేడ్ కూచిపూడి నాట్య కళాకారిణిగా గుర్తింపు పొందారు. మానవ వనరుల అభివృద్ధి శాఖచే జూనియర్ ఫెలోషిప్, తెలంగాణ ప్రభుత్వంచే ఉత్తమ నాట్యకారిణిగా అవార్డు 2015లో అందుకున్నారు. మరెన్నో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. నృత్యనాటికలకు దర్శకత్వం వహించారు. వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో 500లకు పైగా నృత్య ప్రదర్శనలిచ్చారు.

ప్రముఖుల సంతాపం

పద్మజ మరణం తీరని లోటు అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జానపద, గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ.. కుప్పా పద్మజ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లుగా నృత్యంలో పీహెచ్‌డీ సీటు కోసం ప్రయత్నించారని, పీహెచ్‌డీ చేయాలనే చిరకాల కోరిక తీరకుండానే వెళ్లిపోయారని గుర్తు చేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అధ్యాపకులు ఏడిద భీంశంకర్, జక్కోజు సత్యనారాయణ, భాస్కర్‌రావు, అనుమూల యోష, సీనియర్ అసిస్టెంట్ గడ్డం శంకర్, పేరిణి నృత్యగురువులు గజ్జెల రంజిత్‌కుమార్, నవ్యజ, ఓరుగల్లు శారద నాట్య మండలి సభ్యులు జీఎస్ శర్మ, జూలూరి నాగరాజు, వివిధ నృత్య కళా క్షేత్రాల గురువులు సంతాపం తెలిపారు.

ఆహార ధాన్యాల కృత్రిమ కొరత సృష్టించొద్దు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: ఆహార ధాన్యాలను అక్రమంగా నిల్వచేస్తూ కృత్రిమ కొరత సృష్టించవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధరల నియంత్రణపై సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత నెలకు, ప్రస్తుత నెలకు వస్తువుల డిమాండ్ పెరుగుదల పరిశీలించాలన్నారు. డిమాండ్ ఉన్న వస్తువులు క్రమంగా నిల్వచేసి ధరలు పెంచే విధంగా వ్యాపారస్తులు చేయవద్దని ఆదేశించారు. అలాంటి వారిపై అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌ఓ వసంతలక్ష్మి, డీఎస్‌పీ రాజు, డీఎంసీఎస్ మహేందర్, తూనికలు కొలతలు అధికారి అనిల్‌కుమార్, వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతు బజార్ అధికారి షఫియుద్దీన్, డీటీసీఎస్‌లు కృష్ణ, సత్యనారాయణ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.


గడపగడపకూ బీజేపీని తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న రావు పద్మ

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శుక్రవారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ గ్రామానికి ఓబీసీ... గడపగడపకూ బీజేపీలో మోదీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూడా బీసీ సారథ్యంలోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓబీసీలు బీజేపీకి అండగా నిలువాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బెజ్జంకి పూర్ణాచారి, గాజుల సంపత్, నాయకులు బాసాని సోమరాజు, గడప శివ, నర్మెట్ట శ్రీనివాస్, సంతోష్, గీల సురేష్, నాగవెల్లి గోపి, నవీన్, తిలక్, బండి సదానందం పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శ్రీధర్(ఫైల్)

ఐనవోలు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు కాసుగొండ శ్రీధర్(34) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం గమనించిన శ్రీధర్ భార్య లక్ష్మి అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతున్న అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జఫర్‌గఢ్ ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వరంగల్ రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్లతో వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున తక్షణ సాయంగా ప్రకటించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎస్) జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట వివిధ రైతు సంఘాల నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. ముఖ్యమంత్రి గురువారం ఎకరానికి రూ.10వేల చొప్పున ఇస్తామని ప్రకటించారని, అయితే రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. సీఎం ప్రకటించిన రూ.10వేలు ఎందుకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. రైతుల పంటలకు బీమా చేయించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్ మాట్లాడుతూ రుణమాఫీ పథకం అనేది రాష్ట్రంలో ప్రహసనంగా మారిందన్నారు. ధర్నాలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరగోని శంకరయ్య, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, సంయుక్త కిసాన్ మహాసభ జిల్లా అధ్యక్షుడు వల్లందాసు కుమార్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, రాజేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా అప్పారావు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దాచుకున్న డబ్బులు దోచుకున్నారు

నల్లబెల్లి: గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను ఇంట్లో దాచుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు దోచుకున్నారు. మండలంలోని రుద్రగూడెం గొల్లవాడకు చెందిన మేరుగు శ్రీకాంత్ ఇటీవల తనకున్న గొర్రెలను విక్రయించాడు. జీవనోపాధి కోసం టవేరా వాహనాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను వాహనం అప్పు తీర్చాలనుకున్నాడు. గొర్రెలను కొన్న వ్యక్తి శుక్రవారం శ్రీకాంత్ వద్దకు వచ్చి నగదు ఇవ్వడంతో ఇంట్లో దాచిపెట్టాడు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి రాగా.. తలుపులు తీసి ఉండడంతో అనుమానంతో ఇంట్లో డబ్బులను చూడగా.. రూ.50 వేలు, తులంన్నర బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు.

క్షయ నియంత్రణకు సమష్టి కృషి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణ కోసం అధికారులు, ప్రజలు, ఎన్జీఓలు సమష్టిగా కృషి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధినివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్షయవ్యాధి నియంత్రణ చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షయ నియంత్రణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. నిశ్చయ పోషణ్ యోజనలో జిల్లా 89శాతం వృద్ధి సాధించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా క్షయ నియంత్రణలో మెరుగైన సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్, యాకూబ్, ప్రోగ్రాం అధికారి శ్రీవాణి, మాస్‌మీడియా అధికారి అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో మాధవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు వైద్యారోగ్యశాఖ అధికారులు క్షయవ్యాధి నియంత్రణపై ఆర్ట్స్‌కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మహిళా సంఘాల సమన్వయంతో..

ప్రభుత్వం నూతనంగా మహిళల కోసం చేపట్టిన ఆరోగ్య మహిళా క్లినిక్‌లపై వారికి అవగాహన కల్పిస్తున్నామని, జిల్లాలోని మెప్మా, సెర్ప్ మహిళా సంఘాల సమన్వయం చేస్తూ కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తున్నామని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లానుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య మహిళా క్లినిక్‌లు స్వయంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. కంటి వెలుగు శిబిరాల్లో వైద్యులు రాసిన కళ్లద్దాలు జిల్లాకు రాగానే సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో వాసుచంద్ర, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీటీడీఓ ప్రేమకళ, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ ఉన్నారు.లక్ష్యాలను పూర్తి చేయాలి



ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

వరంగల్ కలెక్టరేట్‌లో..

వరంగల్ రూరల్: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆమె రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ బృహత్ పల్లె ప్రకృతి వనాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసే దిశగా పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స కోట, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీఈఓ డి.వాసంతి, డీపీఓ కె.కల్పన, డీటీడీఓ జహీరుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.